# కుల సమస్య - రాజకీయ దృక్పథం

కె. బాలగోపాల్

కుల సమస్య ఇవాళ కొత్తగా వచ్చింది కాదుగానీ ఇవ్వాళ గతంలో కంటే ఎక్కువగా చర్చకు వచ్చింది. అది చర్చకు రావడానికి గల కారణం సమకాలీన చరిత్రే.

కారంచేడు నుండి వరసగా జరుగుతూన్న అత్యాచారాలు ఒక కఠినమయిన వాస్తవాన్ని మన ముందు చర్చకు పెట్టాయి. ఈ దాడులలో ముద్దాయిలు అగ్రకులాలకు చెందిన వారే అయినా ఎక్కువగా సామాన్య రైతాంగమే. వాళ్ళు ఆర్థికంగా తమతో ఎక్కువ తేడా లేనటువంటి హరిజన పేద రైతాంగం కూలిజనాలపైన కులం పేరిట దాడులు చేస్తున్నారంటే కులం అనేది వర్గాన్ని రెండుగా చీల్చి శత్రుబృందాలను మార్చ గలుగుతుందా అనే ప్రశ్న వస్తుంది.

ఈ అత్యాచారాలకు ప్రతి స్పందనగా ఏర్పడిన దళిత ఉద్యమం మరొక ప్రశ్నను ముందుకు తెచ్చింది. అగ్ర కులాలలో పుట్టిన ప్రజాస్వామిక వాదుల మీద కక్ష గట్టినట్లు దాడులు చేసే తెలివి తక్కువతనాన్ని అటుంచి, సహేతుకమైన విమర్శకు తావు ఉందన్న సంగతి దళిత ఉద్యమం గుర్తు చేసింది. కులం అనేది ఒక ఉపరితల అంశమనీ, వర్గ పోరాటం ఫలితంగా పునాదిని ముందు విప్లవీకరిస్తే ఆ పైన ఉపరితలంలో అనివార్యంగా (లేక ప్రయత్న పూర్వకంగా జరిగే సాంస్కృతిక విప్లవ పోరాట ఫలితంగా) వచ్చే మార్పులలో భాగంగా కులం అనేది మాయమయి పోతుందనీ భావించడం ఎంతవరకు సమంజసం అనేది ఈ ప్రశ్న దానికి అనుబంధంగా, విప్లవ ప్రజానీకం చొరవలోనూ చైతన్యంలోనూ సంఘటిత పడడంలో వెనుకబాటుతనాన్ని ప్రదర్శించడానికి, వర్గ సమాజంలో ఎప్పుడయినా వుండే ఆర్థిక సాంస్కృతిక అవరోధాలతో బాటు "కులం" కూడ ఒక కారణం అని గుర్తించి దానిని ప్రతిఘటించనవసరం లేదా అనే ప్రశ్న వస్తుంది. సమస్య తన పరిష్కారానికి తానే అడ్డం అయినట్టు చొరవలోనూ చైతన్యంలోనూ అసమతుల్యం ఉండడానికి కులం ఒక కారణంకాగా దాని ఫలితంగా ప్రజా ఉద్యమాల అగ్రశ్రేణులలో కులం

రీత్యా అధికారస్థానంలో వున్నవాళ్ళే ఎక్కువ ఉండడం అనేది జరిగితే, అది కుల సమస్య పరిష్కారానికీ ఆపైన ప్రజా ఉద్యమ పురోగమనానికీ అవరోధం కాదా అనే ప్రశ్న కూడ వస్తుంది. దళితుల సమస్యలు దళితులే పరిష్కరించుకుంటారనీ స్త్రీల సమస్యలు స్త్రీలే పరిష్కరించుకుంటారనీ, గిరిజనులే సమస్యలు పరిష్కరించుకుంటారనీ, ముస్లింల సమస్యలు ముస్లింలే పరిష్కరించుకుంటారనీ భావించడం ఎవరి సమస్యలూ పరిష్కారం కాకుండ ఉండడానికే ఉపయోగపడ తుంది (అందుకోసమే, కాంగ్రెస్ ప్రభుత్వం తయారు చేసి పార్లమెంటు ముందు ఉంచిన పారిశ్రామిక వివాదాల సవరణ బిల్లులో, కార్మికుల సమస్యలు కార్మికులే పరిష్కరించుకోవాలి, అనే వాదనతో యూనియన్లలో కార్మికేతరుల పాత్రను నిర్బంధంగా తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు) అయితే ఈ ఆలోచనల వెనక వున్న ఒక న్యాయమయిన ప్రశ్నను గుర్తించాలి. అణచివేతకు గురయ్యే ప్రజలు ప్రతిఘటనా చైతన్యాన్ని స్వంతం చేసుకోనిదే అంతిమంగా మార్పురాదు. అది జరిగినప్పుడు, పీడిత ప్రజానీకం తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా చేసే పోరాటానికి అన్ని వర్గాల నుండీ నాయకత్వం సమంగా పుట్టుకొస్తుంది. అది జరగకపోతే ఏదో లోపం వున్నట్టు గుర్తించడం అవసరం. ఉద్యమాల నాయకత్వం అట్టడుగు కులాల నుండీ స్త్రీలనుండీ మైనారిటీలనుండి సమపాళ్ళలో సహజంగానే పుట్టుకు రాకపోవడం ఒకలోపాన్ని సూచిస్తుందన్న వాదనను కొట్టి పారేయడానికి వీలులేదు.

గతంలో కులం ప్రస్తావన తీసుకురావడానికి వెనకాడే పాలక వర్గాలు ఇప్పుడు తమ కొట్లాటలలో కులం ప్రసక్తి బాహాటంగా తీసుకు రావడం ఎందుకు జరుగుతోంది అనేది మరొక చర్చనీయాంశం "తెలుగుదేశం కమ్మకులం పార్టీ" అని కాంగ్రెస్ వాళ్ళు, "కాంగ్రెస్ రెడ్డి, బ్రాహ్మణ పార్టీ" అని తెలుగుదేశం వాళ్ళు ఉపన్యాసాలలోనే కాక హైకోర్టు సమక్షంలో చేసే వాదనలలోనూ పరస్పరం ఆరోపించుకోవడం మొత్తం పాలక వర్గాల శ్రేయస్సుకే నష్టదాయకం కాదా? మరయితే ఈ పని ఎందుకు చేస్తున్నారు? కులం శ్రామిక వర్గాన్ని రెండు శత్రుబృందాలుగా చీల్చగలదా అని ప్రశ్నించుకున్నట్టే అది పాలక వర్గాలను కూడ చీల్చగలదా అని ప్రశ్నించుకోవలసి వస్తుంది.

ఈ ప్రశ్నను ఇవాళ చర్చించుకోవాలి. కఠినమయిన సమస్యలు ఎదురయినప్పుడు చర్చించకుండ ఊరుకోవడం ఒక పొరబాటయితే, ఉదారవాద దృక్పథంతో చర్చించి మార్క్సిస్టు ముక్తాయింపును జోడించడం తరచుగా జరిగే మరొక

పొరబాటు ఈ రెండు పద్ధతులలో కాకుండ "కుల సమస్య"ను మార్క్సిస్టు దృక్పథంతో చర్చించడం అవసరం అన్ని కోణాల నుండి పరిశీలించి సమగ్రంగా సమాధానం చెప్పడం ఒక్క వ్యాసంలో సాధ్యం కాదుగానీ ముఖ్యమైన విషయాలను పరిశీలించాలి.

## నే ప థ్యం

మొదటిగా, కులం కేవలం ఒక ఉపరితల అంశం అనేది ఈ నాటి కాదు, ఏనాడు నిజం కాదు. కులం పునాదికి ఉపరితలానికీ కూడ సంబంధించిన విషయం **caste is a meterial relation of production as well as an ideology** అదే దాని బలం.

కులానికి గల సామాజిక ప్రాతలో మూడు అంశాలున్నాయి. (1) ఒక స్వతంత్రమైన ఆర్థిక జీవన విధానాన్ని అనుసరిస్తూ విడిగా బ్రతుకుతున్న తెగలను నాగరిక సమాజంలో కలుపుకొని పాలక వర్గాల దోపిడీకి లోబరచు కొనడానికి కులం ఒక నిర్మాణ రూపంగా ఉపయోగపడింది ఆ క్రమంలో ఒకవైపు పరసంపర్క నిషేధం వంటి గణ జీవిత లక్షణాలు కులాలకు సంక్రమించగా, గణజీవితంలో లేని దోపిడీ అవమానతలు కొత్తగా వచ్చాయి. ఇప్పుడిప్పుడే తెగనుండి కులంగా మారుతున్న ప్రజలను చూస్తే ఈ విషయం బాగా అర్థం అవుతుంది. (ఉదాహరణకు తూర్పు గోదావరి జిల్లా నుండి శ్రీకాకుళం దాకా తీర ప్రాంతంలో అగ్ని కుల క్షత్రియులు అనే కులం తటస్థ పడుతుంది. కోనసీమలో ఇప్పటికి చాలా చోట్ల ప్రత్యేక గ్రామాలలో వుంటూ చేపలు పట్టుకునే తెగగా జీవిస్తున్నారు అయితే శ్రీకాకుళంలో మట్టుకు గ్రామాలలో స్థిరపడి చిన్న రైతులుగా బ్రతుకుతున్నారు. తెగ లక్షణాలు పూర్తిగా పోకపోయినా కులవ్యవస్థలో శ్రామికులకు సహజమైన ఆత్మన్యూనతా భావం మొదలయిన లక్షణాలు అలవరచుకున్నారు) (2) ఒక కులంలో పుట్టిన వారికి ఆ కుల వృత్తికి సంబంధించిన సామర్థ్యమే తప్ప వేరే నైపుణ్యంగానీ పనిముట్లుగానీ ఉత్పత్తి సాధనాలుగానీ విజ్ఞానంగానీ లేకుండా చేయడం ద్వారా, నాగరిక సమాజానికి అవసరమయిన వివిధ ఉత్పత్తులను సరఫరా చేసే శ్రామిక జనాన్ని కులవ్యవస్థ తయారుచేసింది. ముఖ్యంగా అంటరానితనం అనేది కారుచవగ్గా పనిచేసే భూమిలేని కూలి జనాన్ని, భృత్యులను సమకూర్చింది. బానిసవ్యవస్థలోలాగా ప్రత్యక్ష బలప్రయోగాన్ని ప్రధాన నిర్బంధ సాధనంగా వినియోగించకుండ, సామాజిక నిర్మాణం ద్వారానే కాపాడిన ఫలితాన్ని

సాధించింది కుల వ్యవస్థ ఈ నిర్మాణాన్ని నిలబెట్టడం అధికార యంత్రాంగం బాధ్యత దీనిని సమర్థవంతంగా నిలబెట్టినవాడు "ధర్మప్రభువు" (1) సామాజిక నిర్మాణంలోవున్న ఈ నిర్బంధానికి తాత్విక సాంస్కృతిక ఆమోదం కల్పించే చైతన్య రూపం కుల వ్యవస్థలోని మూడవ అంశం. భౌతిక శ్రమ అన్ని రకాల శ్రమ లోనికి నీచమయినదనీ, అందులోనూ కొన్ని రకాల శ్రమ మరీ నీచమయినదనీ కుల వ్యవస్థ బోధిస్తుంది. మనుషు పుట్టడమే తమ పూర్వ.కర్మలకు ఉచితమయిన కులా లలో పుడతారనీ, తదనుగుణ్యమయిన జీవితాన్ని ఆచరించడమే సన్మార్గమనీ ధర్మ వర్తనం అనీ అంటుంది గుణకర్మలను అనుసరించి తానే మనుషులను కులాలుగా విభజించాననీ, పరధర్మం ఎంత ఆకర్షణీయంగా అనిపించినా స్వధర్మాన్ని వదిలిపెట్టి దానిని ఆచరించడం ప్రమాదకరమనీ నారాయణుడు భగవద్గీతలో స్వయంగా అంటాడు అష్టాదశ పురాణాలనుండి వేలాదిగా ఈ దేశంలో ప్రచారంలోవున్న పుక్కిటి పురాణాల దాకా అన్నీ ఈ సందేశాన్నే చెప్తాయి వీటిని ప్రచారంలో పెట్టడం బ్రాహ్మణుల కర్తవ్యం.

భారతీయ భూస్వామ్య సమాజంలో ఈ విధంగా కీలకమయిన పాత్రను నిర్వహిం చిన కులవ్యవస్థ ఆ రోజులలోనే అనేక ఒత్తిడులనూ ఎదుర్కొన్నది ఆర్థిక రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా కొత్త వృత్తులు పుట్టుకొచ్చాయి. పాత వృత్తులకు కొత్త ప్రాముఖ్యము వచ్చింది. సాంకేతిక పురోగతి వల్ల కొన్ని కులాలు ఆర్థికంగా బల పడ్డాయి. కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా కులవ్యవస్థను ఛేదించుకొని ఉన్నత పదవు లను అందుకున్నారు. అయితే ఇవేవీ కులవ్యవస్థను మౌలికంగా మార్చలేదు. కుల వ్యతిరేక ఉద్యమాలు కూడ చాలా జరిగాయి గానీ అవికూడ కులవ్యవస్థను నాశనము చేయలేక పోయాయి. అతికొద్ది మినహాయింపులతో, ఈ ఉద్యమాలలో ఏవీ కూడ కులవ్యవస్థకూ బ్రాహ్మణ భావజాలానికి కీలకమైన ధర్మం, ఆత్మ, మోక్షం, అనే భావ నలనూ కర్మ సిద్ధాంతాన్నీ తిరస్కరించలేదు కులవివక్షనూ బ్రాహ్మణ ఆధిక్యాన్నీ మాత్రమే తిరస్కరించాయి. వాటిలో కొన్ని ఉద్యమాలు తామూ ఒక కుల రూపం తీసుకొని కులవ్యవస్థలో కలిసిపోయాయి. కొన్ని అల్ప సంఖ్యాక మతాలుగా స్థిరపడి పోయి కులవ్యవస్థలోని అనేక అవలక్షణాలను తామూ ఒంటబట్టించుకున్నాయి. కొన్ని కేవలం పాఠ్య పుస్తకాలలో పాఠ్యాంశాలగానూ, మన చరిత్రలోనూ అభ్యుదయం లేకపోలేదని గొప్పలు చెప్పుకోవడానికి దృష్టాంతాలగానూ మిగిలిపోయాయి కొన్ని పూర్తిగా నామరూపాలు లేకుండ పోయాయి

"పెట్టుబడి" కూడ కులవ్యవస్థను దెబ్బతీయగలదు. పెట్టుబడి అంటే డబ్బు కాదు. పెట్టుబడి అనేది ఒక సామాజిక సంబంధం, ఒక వ్యవస్థ. ఉత్పత్తిసాధనాల్నీ పనిముట్లను కోల్పోయి 'బజారుసరుకు' శ్రామికుల శ్రమశక్తిని-స్వేచ్ఛా వినిమయంలో కొనుగోలుచేసి లాభార్జనదృష్టితో అమ్మకపు సరకులను ఉత్పత్తిచేసి తనను దాను పునర్వ్యాప్తి చేసుకుంటుంది పెట్టుబడి. ఆ క్రమంలో ఉత్పత్తి సాధనాలూ, శ్రామికుల నైపుణ్యమూ, విజ్ఞానస్థాయీ సాంకేతికంగా పురోగమనం చెందుతాయి. దీనికి అడ్డం వచ్చే ఫ్యూడల్ నిర్బంధాలనుండి ఇటు వనరులనూ అటు శ్రమశక్తినికూడా పెట్టుబడి విముక్తి చేస్తుంది. అందుకోసం తలపడవలసిన ఉపరితల అంశాలతో తలపడుతుంది. మన దేశంలో పెట్టుబడి అనేక అభివృద్ధి చెంది వుంటే శ్రామికులను కులవ్యవస్థనుండి విముక్తిచేసి కార్మికులుగా మార్చివుండేది.

బ్రిటిష్ వాళ్ళు రాకపోతే మనదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతంత్రంగా అభివృద్ధి చెంది వుండేదా అనేది తెగని చర్చ. మొగలాయీ పాలన కాలంలోనే పెట్టుబడిదారీ సంబంధాలు బలంగా వేళ్లూని విస్తరించాయని మొదట్లో సోవియట్ పరిశీలకులు సిద్ధాంతీకరించారు. అది నిజంకాదనీ, ఒక సిద్ధాంత చట్రాన్ని వాస్తవాల మీద బలవంతంగా రుద్దిన ఫలితంగా చేసిన నిర్ధారణేనని ఇర్ఫాన్ హబీబ్ వంటి భారతీయ చరిత్రకారులు వాదించగా వాళ్ళు కూడ ఈమధ్య తమ అభిప్రాయాలను కొంత సవరించుకొన్నట్టు ఉన్నారు. ఏదేలాగున్నా బ్రిటిష్ వాళ్ళ రాకతో మొదట వర్తక పెట్టుబడి రూపంలోనూ సామ్రాజ్యవాద వర్తక పెట్టుబడి రూపంలోనూ "పెట్టుబడి" మన దేశంలోనికి బయటి నుండి ప్రవేశించింది. కుల వ్యవస్థనూ స్వయం పోషక గ్రామీణ వ్యవస్థను కొంతమేరను దెబ్బతీసింది. అయితే సంపూర్ణంగా దెబ్బతీసే అవసరంగానీ సామర్థ్యంగానీ సామ్రాజ్యవాద పెట్టుబడికి లేవని త్వరలోనే స్పష్టం అయింది.

ఫ్యూడల్ దశలో కులవ్యవస్థకు ఉన్నట్టు చెప్పుకున్న పైమూడు లక్షణాలలో మొదటిది ఎట్లాగూ (పెట్టుబడి ప్రమేయం లేకుండానే) చారిత్రకంగా అప్రధానం అయిపోయింది. రెండవ విషయంలో సుమారుగా మార్పు వచ్చింది. పెట్టుబడి సాంద్రతనూ సాంకేతిక పురోగతినీ ప్రమాణంగా తీసుకొని ఆర్థిక రంగాన్ని సంఘటిత (organised) అసంఘటిత (unorganised) రంగాలుగా విభజిస్తే, ఉత్పత్తి సంబంధాలలో కులానికి చెందిన పాత్ర సంఘటిత ఆర్థిక రంగంలో చాలావరకు నశించింది.

అసంఘటిత ఆర్థిక రంగంలో మట్టుకు ఇప్పటికీ ఉత్పత్తి సాధనాలకూ పనిముట్లకూ నైపుణ్యానికీ అటు మనుషులకూ మధ్యనున్న సంబంధాన్ని నిర్ణయించటంలో కులం ప్రధానపాత్ర కాకున్నా కీలకమయినపాత్ర నిర్వహిస్తోంది. చాకలి మంగలి కుమ్మరి బెస్త మేదరి గొల్ల తదితర కులాలలో పుట్టినవారికి ఇప్పటికీ వేరే వృత్తులకు సంబంధించిన నైపుణ్యంగానీ పనిముట్లుగానీ అందుబాటులో లేవు. కాపు అనే పేరుతో పిలవబడే అనేక కులాలలో అత్యధిక భాగానికి చిన్నకారు సేద్యమూ, మరింక నులకు అసంఘటిత శ్రామిక రంగమూ, తప్ప వేరే జీవన మార్గాలు అందుబాటులో లేవు.

కాగా, సంఘటిత ఆర్థిక రంగంలోనూ అసలు కుల ప్రమేయమే లేదనుకోవటం సరయింది కాదు. నిజానికి ఆ రంగంలోనే కుల ప్రమేయం కొత్త రూపాలలో - మరింత విస్తృత రూపాలలో - కనపడుతుంది. సంఘటిత రంగంలో అగ్రకులాలసాంద్రత మొత్తం సమాజంలో కంటే బాగా ఎక్కువగా వుంటుంది. నిమ్నకులాలవాళ్ళు బాగా తక్కువగా కనపడతారు. సంఘటిత రంగంలో ముఖ్యభాగమయిన ప్రభుత్వ ఉద్యోగ రంగంలో రిజర్వేషన్లు లేకపోతే ఆ మాత్రం కూడ ఉండకపోదురేమో! మరింత ఎక్కువగా వాళ్ళు ప్రవేశించాలని ప్రయత్నం చేసినప్పుడల్లా రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాల దుమారం చెలరేగుతుంది. అంతేకాక, కులం సంఘటిత రంగంలో తన సాంప్రదాయిక పాత్రను కోల్పోయినప్పటికీ పెట్టుబడికీ ఉద్యోగాలకూ సంబంధించిన పోటీలో ఒక సాధనంగా ఉపయోగపడుతూనేవుంది. ఋణాలూ లైసెన్సులూ కాంట్రాక్టులూ సంపాదించటంలోనూ ఉద్యోగాల పోటీలోనూ కులం నిర్వహిస్తున్న పాత్ర మనకు నిత్యజీవిత అనుభవమే. ఈ పోటీని బూర్జువా భావజాలం గొప్పగా ఆకాశానికి ఎత్తుతుందిగానీ ఇందులో అభద్రత (insecurity) ఒక ముఖ్యమయిన అంశం. పెట్టుబడి ఎక్కడుంటే అక్కడ అభద్రత ఉంటుంది. అందులోనూ పెట్టుబడి (మన దేశంలోలాగ) అస్వతంత్రం అయితే మరీ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల కులం కల్పించే కృత్రిమమయిన భద్రతకోసం జనం కులతత్వాన్ని ఆశ్రయించటం సంఘటిత ఆర్థికరంగంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ కారణంగానే వెనుకబడిన ప్రాంతాలకంటే "అభివృద్ధి చెందిన" ప్రాంతాలలోనే కులతత్వం ఎక్కువ ఉందనిపిస్తుంది.

ఇక మూడవ విషయానికొస్తే, మనుషులు తమ "గుణకర్మలను" బట్టి స్వాభావికంగానే అసమానంగా వుంటారన్న భగవద్గీత ప్రవచనం భారతీయ భావజాలంలో ఈనాటికీ చాలా బలంగా వుంది. అనేక ప్రజాతంత్ర ఉద్యమాలను చూసిన ఈ

దేశంలో కర్మసిద్ధాంతాన్నీ కుల ధర్మాన్నీ బాహాటంగా ప్రచారం చేయడం పాలక వర్గాలకు సాధ్యంకాదుగానీ అణువణువునా ఈ రెండింటినీ జీర్ణించుకున్న బ్రాహ్మణ భావజాలం భారత పాలక వర్గాల భావజాలంలో అతి ముఖ్యమయిన అంశం. అందులో అంతర్లీనంగానే వుంటూ ఇవి రెండూ వ్యాప్తిచెందుతూ వుంటాయి. ఈ విషయంలో మనకేమయినా అనుమానం ఉంటే టి వి ప్రసారాలను దేశంనలుమూలలకూ వ్యాపింప జేసి క్రమం తప్పకుండా చూపిస్తున్న రామాయణ మహాభారతాలలో ప్రసారం అవుతూన్న కథలను కాక సందేశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అనుమానం తీరుతుంది అంత కష్టపడనక్కరలేదు. ఏ టీ బంకు దగ్గరయినా నిలబడి ఘంటసాల భగవద్గీత క్యాసెట్ విన్నా ఈ విషయం అర్థమవుతుంది.

## రాజకీయాలు - కులం

వలస దేశాలలో ప్రజాతంత్ర విప్లవం అంటే భూస్వామ్య సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవం. మన జాతీయోద్యమం కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోకి పోవడం వలన ఈ విప్లవ కర్తవ్యం సంపూర్ణంకాలేదు. కులం అనే సామాజిక అంశానికి సంబంధించి ఈ అసంపూర్తి ఎటువంటిదో పైన వివరించాము. కుల నిర్మూలనం ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకుపోతున్న విప్లవశక్తులకర్తవ్యం. అయితే దాని అర్థం ప్రజాతంత్ర విప్లవశక్తులు కుల నిర్మూలన పోరాటాన్ని చేపట్టాలనికాదు. మత నిర్మూలన ఉద్యమాలతో కులంపోదు. కులంఅనేది పోనిదే ఈ దేశంలో ప్రజాస్వామ్యం గానీ సోషలిజంగానీ సాధ్యం కావన్న అంబేద్కర్ అభిప్రాయంతో విభేదంలేదు. అతే ప్రజాస్వామ్యమయినా సోషలిజమయినా రావాలంటే ముందు కుల వ్యతిరేక ఉద్యమాలు నడపాలని దానినుండి అర్థం చేసుకుంటే పొరబాటవుతుంది. కులసమస్య విప్లవం తరువాత పరిష్కారమవుతుందని వదిలేయడం ఎంత తప్పో ఇదీ అంతే తప్పు.

ప్రజాతంత్ర విప్లవ పోరాటంలో అంతర్భాగంగా కుల సమస్యతో తలపడడం సరయిన వైఖరి. కులసమస్యను విడిగా విశ్లేషించి దానితో విడిగా తలపడటము వలన ప్రయోజనములేదు. దానిని వ్యవసాయక విప్లవ పోరాటములో అంతర్భాగంగా విశ్లేషించి ఆ పోరాటంలో అంతర్భాగంగా తలపడాలి ఈ దృష్టితో విశ్లేషించినప్పుడు ప్రస్తుత దేశ రాజకీయాలలో కులం పాత్ర మూడు రకాలుగా కనబడుతున్నది :

1. పాలక వర్గాల అంతఃకలహాలలో కులం
2. పాలక వర్గాలకూ ప్రజలకూ మధ్యనున్న వైరుధ్యంలో కులం
3. ప్రజలమధ్య సంబంధాలలో కులం

వీటిని విడివిడిగా చర్చిద్దాం

1. గత దశాబ్ద కాలంలో మనదేశ పాలక వర్గాలలో అనైక్యత చాలా పెరిగింది. వంద నూరేళ్ళ చరిత్రలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రధానమయిన విజయం దేశ పాలకవర్గాలను ఐక్యంగా ఉంచగం. భూస్వాములు, వ్యాపారస్తులు, పెద్ద పెట్టుబడిదార్లు వివిధ సామ్రాజ్యవాద దేశాల కంపెనీలు-అందరినీ అన్నింటినీ ఒక తాడిమీద నడిపి, అందరి అవసరాలూ తీరేటట్లు ఆర్థిక వ్యూహాన్ని కాంగ్రెసు నాయకత్వం రచించింది. ఇప్పుడు కాంగ్రెసు పార్టీ పతనంగా మనకు కనపడుతున్న రాజకీయ పరిణామం వెనుక ఉన్నది. బీటలువారుతూన్న ఐక్యత జాతీయ ఉద్యమకాలంలో గాంధి నాయకత్వంలోనూ ఆ తరువాత నెహ్రూ నాయకత్వంలోను ఈ ఐక్యతను నిలబెట్టడానికి రచించిన రాజకీయార్థిక వ్యూహానికి కాలం చెల్లిపోయింది. అది ఎందుకు జరిగిందని చర్చించడం ఇక్కడ సాధ్యపడదుగానీ, ఇకమీదట ఐక్యత అంటూ సాధ్యం కావాలంటే అది కొత్త ప్రాతిపదిక మీదనే జరగగలదు, ఆ కొత్త ప్రాతిపదికకోసం, దాని సాధించగల నాయకునికోసం, ఇవ్వాళ పాలకవర్గాలు అన్వేషిస్తున్నారు. రాజీవ్ గాంధీ మీద చాలామందికి నమ్మకంపోయిందిగానీ అందరికీ సమ్మతమైన ప్రత్యామ్నాయం ఎవ్వరికి కనపడడంలేదు. ఈ లోపల పాలకవర్గాలలోని వివిధ సెక్షన్లు ఉమ్మడి ప్రయోజనాలను ఉపేక్షించి ఎవరికి తోచిన దిక్కుకు వారు బండిని లాగుతున్నారు దానితో బాటు అసలు సమస్య సత్వరంగా పరిష్కారం అవుతుందన్న నమ్మకం కూడ పోయేసరికి ఎవరికివారు తామూ తమవారూ ఎంత వేగంగా ఎంత ఆస్తి సంపాదించుకోగలిగితే అంత సంపాదించుకొని బయటపడాలని చూస్తున్నారు. ఈ పరిస్థితిలో అనేక విషయాలను చర్చకు పెడుతున్నారు. అనేక తొందరపాటు చర్యలకు పాల్పడుతున్నారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, అధికార వికేంద్రీకరణ, ప్రణాళికల వైఫల్యం చర్చకు వస్తున్నాయి. నిన్నటిదాకా జాతికి గర్వకారణం అని అందరూ పొగిడిన ఆర్థిక పారిశ్రామిక విజయాలను ఇవ్వాళ తామే వేళాకోళం చేస్తున్నారు. ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతున్నారు. ఒకరి కుంభకోణాలు ఒకరు బయటపెట్టుకుంటున్నారు. కులంపేరుపెట్టి తిట్టుకుంటున్నారు. దీర్ఘకాలిక దృష్టిలో ఇవి తొందరపాటు చర్యలే. అయితే వాళ్ళు ప్రస్తుతం దీర్ఘకాలిక దృష్టితో చూడడంలేదు.

కులం పేరుమీద తిట్టుకోవటానికి ఒక హేతుబద్ధమయిన కారణంకూడ వుంది. పాలకవర్గాల అంతర్గత కలహాలలో ఎవరికివారు జనాన్ని తమ వెంట సమీకరించుకోవాలని చూడడం సహజం. అది ఎన్నికలకు ఎంత అవసరమో గూండా దాడులకూ అంత అవసరం. ఈ జనసమీకరణకు కులం చాలా చవకయిన సాధనం. అగ్రకులాలలో పాలకవర్గాలకు చెందినవారు అల్పసంఖ్యాకులే అయినా కులాభిమానం జనసామాన్యంలో విస్తృతంగా ఉంటుంది కాబట్టి "తెలుగుదేశం పాలనలో రెడ్లకు అన్యాయం జరుగుతోంది" అనే ఆరోపణ ధనవంతులైన పెద్దరెడ్లవెనక ఆ కులానికి చెందిన సామాన్య రైతాంగాన్ని సమీకరించడానికి చక్కగా ఉపయోగపడుతుంది. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి కృషిచేసినవారు "కాంగ్రెస్‌పాలనలో కమ్మకులానికిసరయిన ప్రాతినిధ్యం ఇవ్వలేదు" అనే వాదనతో ఆ కులానికి చెందిన సామాన్యజనాన్ని తమ వెంట చాలా చాకచక్యంగా సమీకరించుకున్నారు. వంగవీటి మోహనరంగారావు దేవినేని మురళి హత్యకేసులో జైలుకుపోయిన తరువాతే కాపునాయకుడయ్యాడు. ముద్రగడ పద్మనాభంకు తెలుగుదేశం నాయకత్వంతో చెడిన తరువాతే ఆయనకూడ కాపు నాయకుడయ్యాడు. "కాపునాడు" వీళ్ళిద్దరికి రాజకీయభద్రత సమకూర్చడం కోసం పుట్టింది. ఇది అగ్రవర్ణాలకే పరిమితంకాదు. కె. ఇ. కృష్ణమూర్తికూడ ఎన్టీఆర్‌తో తగవుపడిన తరువాతే వెనుకబడ్డవర్గాల నాయకుడయ్యాడు అంతవరకు ఆయన కర్నూలుజిల్లాలో హత్యలకు పేరుపడినంతగా వేరే దేనికీ పేరు పడలేదు.

"కుల ప్రయోజనం" అనేది ఒకటి వుందనే భ్రమ సామాన్యజనంలో ఉండబట్టే ఇది సాధ్యం అయింది. అగ్రకులాలకు చెందిన కొందరు వ్యక్తులు పదవులో ప్రాముఖ్యతో సంపాదించుకుంటే అది తమకే వచ్చినట్టు ఆ కులాలకు చెందినసామాన్యజనం సంబరపడే పరిస్థితి- వాళ్ళతో "ఐడెంటిఫై" అయ్యే పరిస్థితి- ఇవ్వాళవుంది. అది వున్నంతకాలమే పాలకవర్గాల రాజకీయాలు కులంపేరిట మాట్లాడగలవు. ఈ తప్పుడు చైతన్యం పోరాటక్రమంలో దానంతట అదే పోదు. అందుకు విరుద్ధంగా, అది పోరాటక్రమానికి అవరోధంకూడ కాగలదు. పోరాటక్రమంలో దానిని ముఖాముఖి ఎదుర్కొని పోగొట్టాలి. కులాన్ని గురించి మాట్లాడడానికి బిడియపడడం మానేయకపోతే ఇది సాధ్యంకాదు. ఈ విషయం ఇంకొంచెం వివరంగా క్రింద చూద్దాం.

2. ఏ వ్యవస్థాగతమయిన సంక్షోభం పాలకవర్గాల ఐక్యతను నాశనంచేసిందో అదే సంక్షోభం వ్యవస్థలోని కాసిన్ని ప్రజాస్వామిక లక్షణాలను ధ్వంసం చేసింది. అణచి

వేతనూ వర్గసంఘర్షణనూ పెంచింది. ఈ అణచివేతకు కులం ఒక సాధనంగా ఉపయోగపడుతోంది.

సాంస్కృతికమైన అణచివేతకోసం బ్రాహ్మణభావజాలాన్ని బాగావ్యాపింపజేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంత బాహాటంగా ఇది జరుగుతోంది. అన్యాయాన్ని అసమానతనూ ఆమోదింపజేసే కులధర్మం ఈ బ్రాహ్మణభావజాలంలో అంతర్లీనంగావుండి పునర్వ్యాప్తి చెందుతూవుంది. కులం ప్రస్తాపన వచ్చినప్పుడల్లాదానిని వ్యతిరేకించినట్టు కనిపిస్తూ బ్రాహ్మణభావజాలంలో భాగంగా దానిని వ్యాపింపజేయడం మనదేశ పాలకవర్గాలు బాగా అభ్యసించిన విద్య.

ఈ ఆధ్యాత్మిక దాడులతోపాటు భౌతికదాడులకు కూడ కులంఒకసాధనంగా ఉపయోగపడుతూ వుంది. గ్రామీణభూస్వామ్య పెత్తందారీవర్గంమనదేశపాలకవర్గాలలో ఒక ప్రధానమయిన వర్గం. గత నలభైఏళ్ళ "అభివృద్ధి వల్ల ఈ వర్గం బాగా ప్రయోజనం పొందింది. కొందరు "హరితవిప్లవం"వల్ల బాగుపడితే కొందరు కాంట్రాక్టులూ, సినిమాలూ సారాయివ్యాపారంవల్ల బాగుపడ్డారు. గ్రామీణబ్యాంకులూ పంచాయితీలు సహకారంగమూ అందరికీ ఉపయోగపడ్డాయి. ఈ వర్గం ఒకవైపు గుత్తపెట్టుబడిదారీ వర్గంతో దేశవ్యాపితంగా తలపడుతూ మరొకవైపు గ్రామీణ రాజకీయార్థిక వ్యవస్థపైన తన ఆధిపత్యాన్ని నెలకొల్పాలని ప్రయత్నము చేస్తోంది. ఇందులో భాగంగానే గ్రామీణపేదలమీద దాడులు జరుగుతున్నాయి. పేదలు సంఘటితంగా వున్నచోట వాళ్లకు "తీవ్రవాదులు" అన్న ముద్రవేసి పోలీసు యంత్రాంగం సహాయంతో అణచివేత ప్రయోగిస్తే, వాళ్ళు అసంఘటితంగా వున్న చోట కులంపేరుమీద సామాన్యరైతాంగాన్ని రెచ్చగొట్టి పేదలపైన దాడులు చేయిస్తున్నారు. కారంచేడునుండి పిప్పరదాకా గత నాలుగేళ్ళలో జరిగిన హత్యాకాండలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ వాస్తవం అర్థమవుతుంది. దాడిచేసేవారు ఎక్కువగా సామాన్యరైతాంగ యువకులు. వారివెనుక ఆ గ్రామానికి చెందిన భూస్వామ్యపెత్తందారీ వర్గం ఉంటుంది. మళ్ళీ వారి వెనుక రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖస్థానంలోవున్న వున్న వ్యక్తులో గ్రూపులో ఉంటారు. గత అయిదు సంవత్సరాలుగా వేరే ఏ జిల్లాలోనూ జరిగినంతగా చిత్తూరుజిల్లాలో దళితులపైన అత్యాచారాలు జరగడానికి ఆ జిల్లాకు చెందిన చంద్రబాబునాయుడు ముద్దుకృష్ణమనాయుడు రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖస్థానంలో వుండడానికి సన్నిహిత సంబంధం వుందని మనం ఊహించనవసరంలేదు, అక్కడి జనమే చెప్తారు. "మన

వాడు" ముఖ్యమంత్రికి అల్లుడయితే మనకంతా ఏదో ఒరిగిందనే కులాభిమాన భ్రమ జనంలో ఉండబట్టే ఇది సాధ్యం అయింది.

ఈ భ్రమను నేరుగా ఎదుర్కొనటం అవసరం. కులాభిమానం ప్రస్తావన తెస్తే మధ్యతరగతి రైతులు ఉద్యమానికి దూరం అవుతారన్న జంకుతో ఊరుకొంటే అది అంతిమంగా పెత్తందార్లకే ఉపయోగపడుతుంది. చాలా రాజకీయచైతన్యం ఉందనుకొనే గ్రామాలలో సహితం జనం అకస్మాత్తుగా కులతత్వాన్ని ప్రదర్శించడం మొదలుపెడతారు. అయితే ఈ "నేరుగా ఎదుర్కొనడం" అనేది కులవ్యతిరేక ఉద్యమాలరూపంలో కాదు. అవి దళితులకుతప్ప వేరె ఎవ్వరికీ రుచించవు. ఏ పెత్తందారీ వర్గమయితే కులాన్ని ఉపయోగించుకొని సామాన్యరైతాంగాన్ని కూలినాలి జనానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతుందో ఆ పెత్తందారీవర్గానికి వ్యతిరేకంగా అదే రైతాంగాన్నీ కూలిజనాన్నీ ఐక్యంగా సంఘటితపరచిననాడే ఆ వాస్తవం బహిర్గతం అవుతుంది. పెత్తందార్లు గ్రామాలలో భూమి మీద, రాజకీయాలమీద, ఋణసంస్థలమీద, మార్కెటింగ్ వ్యవస్థమీద, తమకున్న పెత్తనంలో కూలిజనాన్నేకాక సామాన్యరైతాంగాన్ని కూడ అణచివేస్తూవుంటారు. వాళ్ళ నోళ్ళు నొక్కడానికి ఇతర ఆయుధాలతోబాటు "మన వాళ్ళు" అనే కులాభిమానాన్ని కూడ వాడుకొంటూవుంటారు. ఆ పెత్తనానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్మించినప్పుడు ఆ కులాభిమానం వర్గస్వభావమేమిటో అర్థం అవుతుంది. ఆ నిర్దిష్టనేపథ్యంలో కులతత్వానికి వ్యతిరేకంగా కృషిచేయటం సాధ్యం అవుతుంది. కులతత్వం వర్గపోరాటానికి ఎక్కడ ప్రతిబంధకం అవుతుందో అక్కడ దానితో తలపడటం సరయిన పద్ధతి.

కోస్తా ఆంధ్రవంటి "అభివృద్ధి చెందిన" ప్రాంతాలలో దోపిడీవర్గాలు అనుసరించే పద్ధతులు చాలా సున్నితంగా ఉంటాయి. కాబట్టి వాళ్ళకు వ్యతిరేకంగా గ్రామీణ జనాన్ని ఐక్యం చేయడం చెప్పినంత సులభంకాదు. రైతాంగం ప్రభుత్వంమీదా పెట్టుబడిమీదా ఆధారపడడం అనేది పెరిగేకొద్దీ ఆ పోటీలోనూ సంక్షోభంలోనూ తమ కులానికి చెందిన పెత్తందార్లనూ కులం కల్పించే భద్రతనూ ఆశ్రయించవలసిన అవసరమూ పెరుగుతుంది. ఆ అవసరాన్ని పెత్తందార్లు తమ ప్రయోజనాలకోసం ఉపయోగించుకుంటారు.

8. ప్రజలు ఒక శ్రామిక వర్గంగా సంఘటితపడాలంటే తమను తాము ఒక వర్గంగా భావించుకోవడం మొదలవ్వాలి అంటే Class-for-themselvcs కావాలి. దీనికి కులచైతన్యం అడ్డువస్తుంది. అంతదూరం పోనక్కరలేదు. సాధారణ మానవ

స్పందనకు కూడ కుల చైతన్యం అడ్డువస్తుంది. ప్రజలచైతన్యానికి "సామాజిక ప్రాతికత్వం" అనే లక్షణం వుంటుందని రణజిత్‌గుహ అనే చరిత్రకారుడు ఈ మధ్య కనుక్కున్నాడు. అంటే భౌగోళికంగా ఒక ప్రదేశాన్నిమట్టుకే "మనదిగా" భావించినట్టు సమాజంలోకూడ ఒకభాగాన్ని మట్టుకే "మనది" అనుకుంటారు. అయితే కులానికి ఈ లక్షణం ఉందని అంబేద్కర్ చాలాకాలం క్రితం గుర్తించాడు. ఒకగ్రామంలో ఎవరికయినా అన్యాయం జరిగితే సాధారణంగా అది ఆ కులంతప్పవేరే కులాలవాళ్ళకు తెలియనుకూడ తెలియదు. యువకులెవరయినా ఆవేశంతోనో ఆదర్శంతోనో తెలుసుకొని స్పందించినా "నీకెందుకొచ్చిన గొడవ ఊరుకో" అని పెద్దవాళ్ళు నోరు నొక్కేస్తారు. అంటే సాధారణమానవస్పందనకు కుల సంస్కృతిలో ఆమోదంలేదు. legitimary లేదు, ఇది గ్రామీణ దోపిడీవర్గాలకు బాగా ఉపయోగపడుతుంది. గ్రామికుల సమస్యలు వృత్తినిబట్టి వేరవుతాయి కాబట్టి ఒక్కొక్కకులాన్నీ విడివిడిగా అణచివేయడం సాధ్యం అవుతుంది. తెలంగాణాగ్రామాలలో దొరలు ఈ ఎత్తుగడను చాలా సమర్థవంతముగా అమలుచేసేవారు అయితే రైతు-కూలీసంఘం అనే నిర్మాణరూపము దీనిని ఎదుర్కోగలిగింది. వృత్తితోనూ కులంతోనూ నిమిత్తంలేకుండ గ్రామికులనందరినీ ఒకే సంఘములో ఐక్యము చేయడముద్వారా అది సాధ్యం అయింది.

అయితే నిజమయిన సమస్య ఇదికాదు. ఈ గ్రామికకులాలలోనూ అసమానతలూ హెచ్చుతగ్గులూ స్వార్థాభావము ఉండగము అసలయిన సమస్య. యీ అసమానతలను పోగొట్టడము ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలలో ఒకటికాగా, అసమానతలు ఉండడమువలన విప్లవసంఘటన, చైతన్యము బలహీనపడతాయి. ఇదికులవ్యవస్థకేకాక స్త్రీల రాజకీయచైతన్యానికి అడ్డుపడే కుటుంబవ్యవస్థకుకూడ వర్తిస్తుంది. కుటుంబము అనేది భవిష్యత్తులో ఉంటుందా పోతుందా అనే చర్చకంటే కుటుంబవ్యవస్థలోని ఈ అణచివేత లక్షణాన్ని ప్రతిఘటించవలసిన అవసరము చాలా ఎక్కువ.

కులవ్యవస్థను నేరుగా ప్రతిఘటించకుండా వదిలేస్తే ప్రజాతంత్ర విప్లవోద్యమము చాలా చైతన్యాన్ని చొరవనూ కోల్పోతుంది. ఉద్యమము "మనది" అని ప్రజలంతా అనుకున్న మేరకే చైతన్యముతో కదిలివస్తారు. కులవ్యవస్థను బాహాటముగా వ్యతిరేకించని ఉద్యమములో నిమ్నకులాలు "మమేకము"కావు ("ఐడెంటిఫై" కావు). పురుషాధికత్యత విధించే శ్రమవిభజనను వ్యతిరేకించని ఉద్యమముతో స్త్రీలు మమేకం కారు. దానిని తమదిగా భావించరు.

# స్పష్టతకోసం అన్వేషణ

ఎన్. వేణుగోపాల్

"ఈ కవిత్వం కొన్నిసార్లు శక్తివంతమైనదే; కాని కేవలం ఒక నిజాయితీతో కూడిన ఉద్వేగ ఆర్తనాదం వలె మాత్రమే. అది అందమైనది కూడ కావచ్చు; కాని కేవలం ఫ్లాబర్టు అభివర్ణించినప్పుడు కుష్టువ్యాధికి కలిగే అందంలా మాత్రమే ఈ కవిత్వం ఒకానొక వ్యక్తిత్వం ఎటువంటిదంటే, జీవితానికి సృజనాత్మకతకూ నిజమైన వనరు అయిన ప్రజలతో సజీవ సంబంధపు స్పృహను హృదయం లోలోపల అణచి వేసుకున్నది"

—గోర్కీ

మనుషులు ప్రపంచాన్ని అర్థం చేసుకునే క్రమంలో కొన్ని ప్రత్యయాల్ని

---

ఈ విషయాలను కమ్యూనిస్టు పార్టీలు ఎప్పుడూ పట్టించుకోలేదనడం న్యాయం కాదు. పార్టీల నాయకులు అగ్రకులాలకు చెందిన మగవాళ్ళు కావడం వల్ల ఈ విషయాలను పట్టించుకోక పోవడం అనేది కుట్ర పూరితంగా జరిగిందనే ఆరోపణ వాస్తవమూ కాదు. అయితే ప్రజల మధ్య వుండే అసమానతను చర్చకు పెడితే అది ప్రజలలో చీలికకు దారితీస్తుందన్న భయం మట్టుకు నిజంగానే వుండింది. ఇప్పటికీ వుంది. ఇవన్నీ "పోరాటక్రమంలో" పోతాయన్న సూత్రీకరణ ఈ భయాన్ని సిద్ధాంతీకరించింది. దానిఫలితంగా తమకు నిత్యం ఆచరణలో ఎదురయ్యే ఈ సమస్యలను సిద్ధాంత స్థాయిలో గుర్తించి వర్గపోరాట అవగాహనతో జోడించలేకపోయారు. దానిని వైఫల్యంగానే గుర్తించాలి. ప్రజలకూ పాలకవర్గాలకూ మధ్యనున్న వైరుధ్యం చుట్టూ పోరాటాన్ని నిర్మిస్తూ, తదనుగుణమైన పోరాట రూపాలకూ నిర్మాణ అవసరాలకూ ప్రాధాన్యం ఇచ్చేటప్పుడు, ప్రజల మధ్యనున్న అసమానత గురించి అప్రమత్తంగా ఉండకపోతే అది ప్రజా చైతన్యానికి ప్రతిబంధకం కావడమే కాక, ఆ అసమానతలు ప్రజా ఉద్యమాలలో పునరావృతం అయ్యే ప్రమాదం వుంది. ప్రజా సంఘాలలోనూ పునరావృతం అయ్యే ప్రమాదం వుంది. అది ఏమేరకు జరుగుతుందో ఆమేరకు సామాజిక విప్లవంలో ఈ అసమానతల పరిష్కారం కష్టతరం అవుతుంది. ఆ మేరకు ప్రజాతంత్ర విప్లవం అసంపూర్తిగా ఉండడమే కాక, తిరోగమనానికి పునాది కూడ ఏర్పడే ప్రమాదం వుంది.

—o—

మూలం: సృజన, మాసపత్రిక, జన